# కథ

# రేపటి తీర్పు

'బుధ'



ఆ గది లోకి వెళ్లాలంటే భయం.

ప్రపంచంలోని అన్ని జంతువుల తలలు ఆ గదిలో ఉన్నాయి. తల లంటే నిజమైన తలలు కావు. 'మాస్క్'లు. నిజానికి వాటిని చూసి నా కెప్పుడు భయం కలగలేదు. నిత్యం వాటిని ధరించే 'పశూ' ను చూసే భయం.

పశూ అంటే పశుపతి. అది వాడికి వాడే చేసుకున్న నామకరణం. తల్లి దండ్రులు పెట్టిన పేరు వివేక్.

తలుపు తోశాను. తెరచుకోలేదు.

"వివేక్! వివేక్!" పిలువబోయాను. అంతలోనే గుర్తొచ్చింది. వాడి మాట.

"పశూ... పశూ!" అని పిలిచాను. వాడిని అలా పిలిస్తేనే వాడికి ఆనందం మహదానందం.

వాడు మనిషి కాదట!

"ఒరే పశువా!" మొదట్లో వాడిని కసిగా పిల్చాను నామకరణం చేసుకున్న రోజున. వాడి ఆనందం అంత ఇంత కాదు. పిల్లిలా మొగ్గలేసి, నెమలిలా నాట్యం చేసి, పాములా మెలికలు తిరిగి, నాతో స్వీట్స్ తినిపించాడు.

ఆ రోజు నుంచి వెంటనే తలుపు తీయక అప్పుడప్పుడు "ఒరే పశువా!" అని గట్టిగా అరిస్తే తప్ప తలుపు తీయడు.

తలుపు తెరచుకుంది.

పశూ మొహానికి కోతి మాస్క్ తగిలించుకుని నన్ను చూడగానే కిచకిచ మని శబ్దం చేశాడు.

నేను వాడికేం చెప్పలేను. ఎందుకంటే ప్రతిక్లాసులోనూ నాకన్నా వాడికే మార్కులు ఎక్కువ వచ్చేవి. అంతేకాదు. నేను చదువు మధ్యలో మానేస్తే వాడేమో నాకన్నా మరో రెండాకులు ఎక్కువే చదివాడు.

వాడికి బుద్ధి లేదని అనడం నన్ను నేను బుద్ధి లేదని అనుకోవడమే!

నాకు బుద్ధి లేదా? నేను ఆఫీసర్‌ను. నాలుగంకెల జీతం వస్తోంది. కానీ నా కన్నా ఆర్నెల్లు వాడు సీనియర్ ఉద్యోగంలో కూడా.

"ఏమిట్రా దిగులుగా ఉన్నావ్ - సరే ఇది పెట్టుకుంటాగా?" కోతి మాస్క్ తీసి సింహం మాస్క్ పెట్టుకుని సింహంలా గర్జించాడు.

వాడెందుకిలా మారాడో తెలిదు. ప్రతిరోజూ ఆఫీసుకు అందరిలా వస్తాడు. ఆఫీసుపని చక్కగా చేస్తాడు. అంతే! ఇక మిగిలిన సమయాన్ని అంతా ఆ జంతు ప్రపంచంలో గడిపేస్తాడు.

మాస్క్‌లు వేసుకుని అద్దంలో చూసుకుంటూ ఆనందిస్తూంటాడు.

అప్పుడప్పుడు పచ్చిగడ్డి పరకలు గాడిద మాస్క్ వేసుకుని కొరుకుతాడు.

గడ్డికొరకుతుండగా మొదటిసారి చూసి నేను, చాలా బాధ పడిపోయాను.

"రేయ్! 'మాస్క్' వేసుకున్నావ్ - సరే నీ ఆనందమది - గడ్డి ఎందుకు కొరుకుతావ్‌రా?" నా గుండెల్లో ఎక్కడో బాధ పిండినట్లయితే అన్నా.

"అదేమిటి? ఆముదం తాగిన వాడిలా మొహం పెట్టావ్? నీవూ ఏదో ఒక మాస్క్ వేసుకో - గడ్డి కొరకడమంటే మనల్ని మనం ఉద్ధరించుకోవడం తెలుసా?"

గడ్డికొరకడం ఎలా ఉద్ధరించుకోవడమో అన్నది. అర్థంకాక నిండుగా పెరిగిన గడ్డాన్ని పీక్కున్నాను.

"నీకు తెలియదా? ఒకసారి గాంధీగారి ఎదుట ఒక హరిజనుడు గడ్డి కొరుకుతూ నిలబడ్డాడు - గాంధీ గారు ఎందుకలా చేస్తున్నావని అడిగితే అలా చేయడం తన్ను కించ పరుచుకుని గాంధీని గౌరవించినట్టు అన్న సమాధానం ఇచ్చాడట తెలుసా?"

ఆ జవాబుకూ ఇప్పుడు వీడు గడ్డి కొరకడానికీ - గడ్డి కొరికి తనను తాను ఎలా ఉద్ధరించుకుంటున్నదీ నాకేం తెలియలేదు.

ఒకసారి ఏం జరిగిందంటే మాస్క్ లేకుండా అద్దం చూసుకున్నాడు. వాడిది అందమైన మొహం. వంకీల జుట్టు. ... చక్కటి మీసకట్టు. నిండైన చెక్కిళ్లు. అసలు వాడికున్న అందం నాకే ఉండిఉంటే, కనీసం టీవి సీరియల్స్‌కైనా ప్రయత్నించేవాడిని.

పరిశీలనగా చూస్తూ 'తుప్రుక్కున' ఊశాడు అద్దంపైన... వెంటనే ఏదో భరించరాని దృశ్యం చూసినట్టు మొహం పెట్టి పక్కనే ఉన్న నక్క మాస్క్ పెట్టుకున్నాడు.

"నిన్ను నీవు ద్వేషించుకుంటున్నావా? ఎందుకు?" అడిగాను ఉండబట్టలేక.

"నో! నేను నక్కను. నన్ను నేను ద్వేషించుకోవడం ఏమిటి? ఓహో! అర్థమైంది. ఇంతకు ముందు మాస్క్ లేదుగా అందుకే ఊశాను. నీకు తెలియదా! 'ఫేస్ ఈజ్ ది ఇండెక్స్ ఆఫ్ ది మైండ్.' నేను ఊసింది ఫేస్ పైనే- నేను సమాజానికి ప్రతినిధిని. సమాజం ఆలోచనలు నా మొహంలో ప్రతిబింబిస్తున్నాయ్ - సంస్కృతి, సభ్యత, నాగరికత రంగులు పులుముకుని ఎంత కాంతివంతంగా కనబడాలని ప్రయత్నిస్తున్నా అసలు రంగు నా కళ్లకు కనబడుతూనే ఉంది... అందుకే....."

అప్పుడెప్పుడో ఒకసారి మరో జన్మ అంటూ ఉంటే పిల్లి అయి పుడతాడట. మనుషుల్లో 'ఒరిజినాలిటీ' లేదట పిల్లిని కాపీ కొట్టి హాకీ, 'ఫుట్‌బాల్' కనుక్కున్నారని అన్నాడు.

మరొకసారి జింక అయి పుడతానని ముచ్చట పడ్డాడు ఆరోజు పెట్రోలు ఎక్కడా దొరకలేదు. ఉన్న స్కూటర్‌ను కాలితో తన్ని పరిగెత్తుకుంటూ వచ్చాడు ఆఫీసుకు.

"నీకేమైనా మతి పోయిందా?" అని అడిగాను.

"నాకా! మతిపోయింది మీకే! లాల్‌బహదూర్ శాస్త్రీ గుర్తు లేదూ. నెత్తిపై అంగీ చుట్టుకుని ఈతకొట్టు కుంటూ ప్రవాహాన్ని దాటి స్కూలుకు వెళ్లేవాడు - మరిచిపోయావా?"

వాడు, వాడి ఆలోచనల తీరు చూస్తుంటే అభివృద్ధి నిరోధక శక్తిలా కనిపిస్తున్నాడు. అదే అన్నా వాడితో ."శాస్త్రం ఇంత ముందంజ వేస్తుంటే..." నా మాటటలు పూర్తి కాకనే -" ఎంత ముందంజ వేసిందేమిటి?
ఆనాడు రాయిని రప్పను వాడాడు - ఈ రోజు లోహాన్ని వాడుతున్నాడు. అప్పటి ఆకలీ ఇప్పటి ఆకలీ ఒకటే అప్పటి చావు పుట్టుకలూ, ఇప్పటి చావు పుట్టుకలూ ఒకటే. ఇప్పుడు సాధించిన అభివృద్ధి మాత్రం నిజమైన అభివృద్ధా?... ఇదెంత శాశ్వతం? అభివృద్ధి పేరిట పరస్పరం ఒకరిమీద ఒకరు ఆధారపడడం పెరిగి నానాటికీ బలహీనుడై పోతున్నాడే!"

"రేయ్! ని ఆలోచనలు తప్పురా - సమన్వయం, సహకారం, పారిశ్రామిక ప్రగతి, ప్రపంచదేశాల అభివృద్ధి"... ఇలా ఏవేవో చెప్పాలని. కానీ అప్పుడే పైకి వెడుతున్న 'లిఫ్ట్' కరెంటు కోతతో ఆగిపోయింది.


"ఇప్పుడు నేను ఉడుత కావాలనుకుంటున్నా!" నా వైపు ఎగతాళిగా చూస్తూ అన్నాడు.

'లిఫ్ట్' ఆగిపోయినందుకు వాడిలో అదో ఆనందం. అంతేకాదు. వర్షాలు పడకపోతే ఆనందం కరువు కాటకాలు వరదలు వస్తే మరింత ఆనందిస్తాడు.

ఒకసారి తుపాను వచ్చింది. ఎక్కడ చూసినా నీళ్లే! నగరమంతా జలమయం.

"హిహిహీ!. నే నిప్పుడు తాబేలు నవుతా. లేదంటే మొసలి నైపోతా!" అంటూ నెలజీతం మొత్తం నాపైకి విసిరికొట్టాడు.

వాడిని తప్పుపట్టడానికి వీలులేదు. డబ్బు ఇచ్చినా ఏమీ దొరకని పరిస్థితి!




"సంవత్సరం క్రిందట దరఖాస్తు చేసినా గ్యాసు కనెక్షను రాలేదట అయ్యా!" కనువు చిమ్మే లచ్చిమి అంది---

"నా గ్యాసు తీసికెళ్లమను - నాకో బొగ్గుల కుంపటి తెచ్చిపెట్టు -" బార్టరు సిస్టంతో బేరం పెట్టాడు గ్యాస్‌ను.

"నా కొల్ల బాబూ! మాకు కుంపటే నయం." సౌదీ సంక్షోభంతో గ్యాసుకు కూడా కొరత ఏర్పడింది.

కుక్క మాస్క్ వేసుకున్నా డొకసారి. "స్నానం చేయడం బదులు ఒళ్ళంతా నాక్కోవాలని ఉంది" అన్నాడు. కొళాయిల్లో నీళ్లు రావడం లేదని వేరే చెప్పనక్కరలేదు.

రాజకీయ నాయకులు మతాల పేరిట! తెగల పేరిట ప్రజలను చీల్చి తమ పబ్బం గడుపుకోడానికి సిద్ధ పడుతున్నారు.

ప్రజలలో ఏవేవో భయాందోళనలు. ఆత్మాహుతులు చేసుకుంటున్నారు.

ప్రజలు ప్రభుత్వ ఆస్తి నష్ట పరుస్తున్నారు. మూడు రోజులు కర్ఫ్యూ విధించారు.

ఆ మూడు రోజులు పశూ గది దాటి రాలేదు.

ఎవరో మంత్రి వస్తున్నాడట.

ఘనంగా ఆహ్వానం ఏర్పాటు చేశారు పార్టీ పెద్దలు.

ఆ రోజు నిజంగా పులి వేషం వేసి మాస్క్ పెట్టాడు పశూ.

నా కేమిటో భయంగా ఉంది. వాడి వాలకం చూస్తుంటే.

"రంగులు పులుపుకుని అడుగడుగునా వంచన పెరిగి పోతున్న ఈ ప్రపంచం నాకొద్దురా! టాగోర్ ఏమన్నాడో గుర్తుందా... "వేర్ ది మైండ్ ఈస్ విత్‌వుట్ ఫియర్...." అంటూ గీతాంజలి పద్యం అందుకున్నాడు.

టీవీలో వార్తలు వస్తున్నాయి.

"రామ జన్మభూమి బాబ్రీ మసీదు సమస్య"...

"రిజర్వేషన్ అంటీ రిజర్వేషను గోల."

"పదవుల కోసం ప్రాకులాటలు."

"ఎన్‌కౌంటర్లు."

"దారుణాలు... విధ్వంస కాండ."

"పశూను అరెస్టు చేశారు." టీవీ వార్తకాదు ఎవరో వచ్చి చెప్పారు.

హడావుడిగా పోలీస్ స్టేషనుకు పరిగెత్తన్ను.

కటకటాల వెనక పులివేషంలో పశూ. నిజంగా పులిని బంధించినట్టుగా బోనులో ఉంచినట్టుగా ఉంది.

"సార్...." పశూ ఒక ఆఫీసరని ఎస్సైతో చెప్పబోయాను.

పశూ వారించి నన్ను పిలిచాడు.

"రేయ్! ఇన్ని రోజులకు సమాజాన్ని సమాజంలోని కుళ్లును, అవినీతిని, అక్రమాన్ని పట్టి బంధించి జైలులో పెట్టానురా!"

ఎవరు ఎవర్ని జైలులో పెట్టింది నాకేం అర్థం కాలేదు.

"నిద్ర లేవడానికి - సగర్వంగా తల ఎత్తుకోవడానికి, హాయిగా గాలి పీల్చుకోవడానికి... ఆందోళనలు సమస్యలు లేకుండా ఆత్మ విశ్వాసంతో మనగల్గడానికి ఇన్ని రోజులకు నాకు స్వాతంత్ర్యం వచ్చిందోయ్. సమాజ కారాగారం నుండి విడుదల అయ్యాను." పశూకళ్లల్లో అదేదో వింతకాంతి. 'పశూను' పిచ్చి వాడని. పబ్లిక్ న్యూసెన్స్ క్రియేట్ చేస్తున్నాడని పోలీసులు అతనిపైన కేసు నమోదు చేసి 'సెల్'లో తోశారు.

'సమాజంపై పశూ వేస్తాడు... అభియోగాలు ఎన్నో! చేస్తాడు ఆరోపణలు మరెన్నో.

--ఆక్రోశంతో తన ఆవేదనను వెలిగక్కుతాడు! ఆవేశంగా నిలదీసి అడుగుతాడు. సంజాయిషీలు!

ఎవరు దోషులు?

సాక్ష్యం లేకుండా సమాజాన్ని స్మశానం వైపు నడిపిస్తున్న పెద్దల్ని ఎలా శిక్షిస్తుందో కోర్టు?

రేపటి కోసం ఆశగా ముఖానికి రంగులు పులుముకుని శ్మశాన సమాజంలో నడుస్తూ వెళుతున్నాను నేను.

అంతరంగ న్యాయస్థానంలో ప్రతి అంతరాత్మ న్యాయ నిర్ణేత!

★